పంచాయతీలకు గూడు కరువు

- నిధులు మంజూరైనా.. నిర్మాణానికి నోచుకోని వైనం
- శిథిల, అద్దె భవనాలే దిక్కు
- అరకొర వసతులతో ఇబ్బందులు



అద్దె భవనంలో కొనసాగుతున్న గురిజాల గ్రామ పంచాయతీ కార్యాలయం

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన సుపరిపాలన, మౌలిక వసతులు కల్పించాల్సిన గ్రామ పంచాయతీలు సమస్యలతో సతమతమవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక పాలకవర్గం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోంది. శిథిలావస్థకు చేరిన భవనాలు, అద్దె భవనాల్లో అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తూ పరిపాలన సాగుతోంది. నూతన భవనాల కోసం నిధులు మంజూరైనా నేటికీ నూతన నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోకపోవడం శోచనీయం.

55భవనాలకు నిధులు మంజూరు..

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం 114 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 55 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. బెల్లంపల్లి మండలంలో 11, భీమినిలో 7, కన్నెపల్లి లో 4, కాసిపేటలో 12, నెన్నెలలో 6, తాండూర్‌లో 6, వేమనపల్లిలో 9 నూతన భవన నిర్మాణాల కోసం గతంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒక్కో భవనానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 47, ఐటీడీఏ ద్వారా 8 గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయి.

సమస్యల పరిష్కారంలో విఫలం...

నూతన గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అధిగమించడంలో అధికార యంత్రాంగం విఫలమైనట్లు తెలుస్తోంది. నూతన భవన నిర్మాణం కోసం కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, మరికొన్ని చోట్ల భూ వివాదాలు నెలకొనడంతో పాటు పలు రకాల సమస్యలు ఎదురయ్యాయి. వీ టిని పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధి కనబరచడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో స్థానికులతో చర్చించి సమస్యలను పరిష్కరించుకొని ముందుకెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ఆ దిశగా చొరవ చూప డం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చిత్తశుద్ధిని కనబరిచి నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మా ణం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూసి ప్రజలకు మెరుగైన పాలన అందించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడాది గడిచినా ముందుకు సాగని వైనం...

గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడి ఏడాది కావస్తున్నా, నేటికీ నూతన భవనాల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. 55గ్రామ పంచాయతీ భవనాలకు రూ.11కోట్లు మంజూరైనప్పటికీ నేటికీ సుమారు ఏడింటి పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. అవి కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికీ ఏ ఒక్క గ్రామ పంచాయతీ భవన నిర్మాణం తుది దశకు చేరుకోలేదు. ఇంకా 48గ్రామ పంచాయతీల నిర్మాణ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా అధికారుల తీరు కనిపిస్తోంది. అన్ని రకాల మౌలిక వసతులతో గ్రామ పంచాయతీల నిర్మాణాలను పూర్తి చేసి, మెరుగైన పాలనను అందించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పనులు పూర్తయ్యేలా చూస్తాం

నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు కొన్ని చోట్ల స్థలం లేక, మరికొన్ని చోట్ల అనివార్య కారణాలతో ఆలస్యం అవుతున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభమై సాగుతున్నాయి. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– సఫ్దర్ అలీ, ఇన్‌చార్జి డీఎల్‌పీవో, బెల్లంపల్లి

క్లుప్తంగా

కేజీబీవీ సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి

వేమనపల్లి: కన్నెపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను కన్నెపల్లి ప్రత్యేక అధికారి, జిల్లా పశువైద్యాధికారి శంకర్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలోని క్లాస్ రూమ్‌లు, వంట గది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కేజీబీవీ సిబ్బంది పాఠశాలకు కంపౌండ్‌వాల్, బోర్ సైతం ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏపీవో శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాలపై విచారణ చేపట్టాలి

మంచిర్యాలఅర్బన్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన టాక్స్‌లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. పాఠశాలపై చర్యలు తీసుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్, జిల్లా నాయకులు రాహుల్, తిరుపతి, కార్తీక్, సిద్దార్థ, మహేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని ఊత్కూరు యూత్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రెయినేజీల్లో మురుగు నీరు పేరుకుపోయి దోమలు ప్రబలుతున్నాయని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని మురుగుకాలువలు శుభ్రం చేయించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, శానిటేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు దర్శనాల నవీన్, నాయకులు ఇందల్ రాథోడ్, నాగరాజు, ప్రదీప్, ప్రవీణ్, కిషోర్ పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక శిబిరం


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

జన్నారం: మండలంలోని జన్నారం, జువ్విగూడ గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనుల కోసం పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఓపెన్ శిబిరాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, వివిధ బ్యాంకుల మేనేజర్లు హాజరై గిరిజనులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం శిబిరం నిర్వహించినట్లు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ లేనివారికి ఖాతాలు తెరిచినట్లు పేర్కొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: రేషన్‌డీలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌డీలర్లు తక్కువ కమీషన్‌తో ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. క్వింటాల్ బియ్యం పంపిణీకి రూ.300తో పాటు గౌరవ వేతనం రూ.5వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం త్వరలో కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డీలర్ల సంఘం నాయకులు, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు పరిహారం ఇవ్వాలని ఆదేశం


కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న చైర్ పర్సన్, కమిషనర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్–రైల్వేస్టేషన్ ఏరియాలో వరద ముంపుతో నిరాశ్రయులైన బాధితులకు వెంటనే పరిహారం అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, కమిషనర్ కే.శ్రీనివాసరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రైల్వే కాంట్రాక్టర్, ఇంజనీర్‌ను పిలిపించి జరిగిన ముంపు నష్టాన్ని వివరించారు. రైల్వేట్రాక్ పక్కన నీరు బయటకు వెళ్లిపోకుండా అడ్డుకట్ట కట్టి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, మట్టి కట్టను తెంచడంతో దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి నీటి వరద చేరిందని, ఏడు కుటుంబాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయారని రైల్వే కాంట్రాక్టర్, ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ నెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కవితకు బెయిల్ మంజూరుపై సంబురాలు


దివాకర్‌రావుకు కేక్ తినిపిస్తున్న నాయకులు

మంచిర్యాలక్రైం: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావడంతో జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. లిక్కర్ స్కామ్‌లో ఆరోపణల మేరకు జైలుకు వెళ్లిన కవితకు బెయిల్ మంజూరు కావడంపై బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నడిపెల్లి విజిత్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్సై ఆంజనేయులు

కాసిపేట: విద్యార్థులు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు సూచించారు. మండలంలోని ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం పోక్సో యాంటీ డ్రగ్స్ యాక్టు, పబ్లిక్ ప్రాపర్టీ ప్రొటెక్షన్, డయల్ 100 వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో రూపొందించిన స్కూల్ డైరీ ఆవిష్కరించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా హోంవర్క్ వివరాలను నోట్ చేసుకొని, ఇంటి వద్ద పూర్తి చేసి తల్లిదండ్రుల సంతకం తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: రేషన్ దుకాణాల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీసీఎస్‌వో) బ్రహ్మారావు అన్నారు. జిల్లాకు కొత్తగా వచ్చిన డీసీఎస్‌వో, ఏఎస్‌వో వేణుగోపాల్‌లను జిల్లాలోని రేషన్ దుకాణదారుల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పూష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట: మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ కోర్సుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ నాలుగో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఏ పరీక్ష ద్వారా అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలుంటాయని తెలిపారు.

‘రుణమాఫీ కాని రైతులు ఆందోళన పడొద్దు’

మందమర్రిరూరల్: ప్రభుత్వం అందించే రుణమాఫీ విషయంలో రుణమాఫీ కాని రైతులు ఆందోళన పడొద్దని చెన్నూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ తెలిపారు. రుణమాఫీ నిబంధనల్లో భాగంగా కుటుంబసభ్యుల నిర్ధారణ లేకపోవడం, రూ.రెండు లక్షలకు మించి రుణం తీసుకోవడం, పాస్ పుస్తకాలు లేకుండా రుణాలు తీసుకోవడం, ఆధార్‌కార్డు వివరాలు తప్పుగా తెలపడం లాంటి కారణాల వల్ల మండలంలో ఇప్పటి వరకు నాలుగు వందల మందికి రుణమాఫీ కాలేదని తెలిపారు. వారందరి వివరాలు సేకరించి ఆన్‌లైన్ ద్వారా నాలుగో విడుత రుణమాఫీలో జమ చేయించనున్నట్లు పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సంతకాల సేకరణ


న్యూటెక్ గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తూ...

శ్రీరాంపూర్: బొగ్గుగనుల వేలం రద్దుచేసి సింగరేణికి ఆ గనులు కేటాయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్కే న్యూటెక్, ఆర్కే 5గనులపై మంగళవారం కార్మికులను కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కస్తూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ పరిధిలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలన్నారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల నుంచి 35శాతం వాటాను కార్మికులకు చెల్లించాలన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.29వేల కోట్లను వెంటనే చెల్లించాలన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టి, అనంతరం గని మేనేజర్లకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఫిట్ సెక్రటరీలు పెరిక సదానందం, ఇప్ప సురేష్, నాయకులు రాజేష్, సందీప్, రవి, రాజయ్య, లక్ష్మణ్, సురేందర్ పాల్గొన్నారు.

కాసిపేట గనిపై రక్షణాధికారికి సన్మానం


సన్మానిస్తున్న నాయకులు, కార్మికులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న రక్షణాధికారి సునీల్‌కుమార్‌ను మంగళవారం కార్మిక సంఘాల నాయకులు, అధికారులు గజమాలతో సన్మానించారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా అతడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గని మేనేజర్ భూశంకరయ్య, డిప్యూటీ మేనేజర్ నిఖిల్, సంక్షేమాధికారి జీషాన్, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వాలి


మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిచిన సంఘానికి వెంటనే గుర్తింపు పత్రం అందించి, నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–5 గనిపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గని మేనేజర్ ప్రవీణ్ ఫాతిన్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీ యూ బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ.. సింగరేణిలో నిర్మాణాత్మక సమావేశాలు లేకపోవడంతో అనేక కార్మిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అల్లి రాజేందర్, రామస్వామి, వంశీ, శ్రీనివాస్, రాంబాబు, భరత్ ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల పక్కా భవన నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆసుపత్రి భవన నిర్మాణం ఆలస్యం చేయొద్దని, రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పనులు జాప్యం చేయొద్దన్నారు. ప్రజల సౌకర్యం కోసమే అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎండీ ఆరిఫ్, పింగిళి రమేష్, చింత అశోక్, తిరుపతి పాల్గొన్నారు.

హైడ్రాను జిల్లాలో అమలు చేయాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: హైడ్రాను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా జిల్లాలో కూడా విస్తరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతి అందజేశారు. కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీపతి రాములు మాట్లాడుతూ జిల్లాలో చాలాచోట్ల ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయని అన్నారు. జిల్లాలో హైడ్రాను ప్రారంభించాలని ప్రభుత్వ భూములు కబ్జాదారుల నుంచి కాపాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజేష్‌యాదవ్, రవి, రాజేష్, సమ్మయ్య, శ్రీధర్, సతీష్, నరేందర్‌గౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా


ఏపీఎం శ్యామలకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు మండల ఐకేపీ వీవోఏలు తెలిపారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏపీఎం శ్యామలకు వినతిపత్రం అందజేశారు. వీవోఏలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు పొట్ట పోశం , మండల కార్యదర్శి గాయత్రి, కోశాధికారి మహేశ్, ప్రచార కార్యదర్శి వెంకటస్వామి, వీవోఏలు రాజయ్య, కవిత, సృజన, విజయలక్ష్మి, మంజుల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

లక్సెట్టిపేట: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఈ నెల 28వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ హాజరై ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీవో లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుంపల రంజిత్, సిబ్బంది లచ్చన్న, లక్ష్మిరాజం, శేష, అనిత, లావణ్య, వినోద పాల్గొన్నారు.

షరతులు లేకుండా మాఫీ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల రాజేశం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మేదరి దేవరం క్షేత్రస్థాయిలో బ్యాంక్ అధికారుల పెత్తనం లేకుండా విధివిధానాలు ఏర్పాటు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లింగం రవి, కేతిరెడ్డి రమణరెడ్డి, రాజన్న అజయ్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: ప్రభుత్వం రైతులకు షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చెన్నూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాత తహసీల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు గర్రెపల్లి వెంకటనర్సయ్య, తుమ్మ శ్రీపాల్, చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల నాయకులు మూర్ల శంకర్, మంత్రి రామయ్య, కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, కాశెట్టి నాగేశ్వర్‌రావు, పెద్దంటి పున్నం, దీక్షితులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: ఆదివాసీల ఐటీడీఏలో బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ, డీఎస్సీ ఏర్పాటు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య ఆదివాసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా మంగళవారం నాయకులు ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేయించారు. ప్రభుత్వం ఆదివాసీల సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహాల పల్లకి సేవ

తాండూర్: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల పల్లకి సేవ కనుల పండువగా జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం వైభవంగా ఎక్కాహం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎక్కాహంలో పాల్గొని పూజలు చేశారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి పునరావాస కాలనీలో శ్రీఅభయాంజనేయ శివపంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గణపతి పూజ, ధాన్య, ఫల శయ్యాది వాస పూజా కార్యక్రమాలు మంగళవారం వేదపండితులు నిర్వహించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

నెన్నెల: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా డయాసిస్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో నెన్నెల మదర్ థెరిస్సా చర్చిలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పీవీఆర్ఐ నేత్ర వైద్య శాల నిపుణులు 80మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోండి

మంచిర్యాలక్రైం: ఈ నెల 30న మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శరత్ మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం రోజున ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జీపీ ఎన్నికల ఓటరు జాబితా పరిశీలన

భీమారం: వచ్చే పంచాయతీ ఎన్నికల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారు చేస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితా మ్యాపింగ్(వార్డుల వారీగా) చేసే ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు.

కన్నెపల్లిలో కళాజాత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో సాంస్కృతి సారధి ఆధ్వర్యంలో ‘స్వచ్ఛదనం పచ్చదనం’పై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రజలకు పాటల ద్వారా సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాకారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్, బిక్కనగూడ గ్రామాల్లో తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది ప్రజలకు వివరించడంతో పాటు, వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులు అందించారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

జన్నారం: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జన్నారం మండలంలో ఇటీవల పదవీ విరమణ పొందిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను మంగళవారం ఘనంగా సన్మానించారు.

జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

దండేపల్లి: పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గంలో మండల నాయకులకు చోటు లభించింది. జిల్లా ఉపాధ్యక్షులుగా నరేందర్, వినోద్, కార్యదర్శులుగా రాజమౌళి, సురేందర్, గఫూర్, శ్రీనివాస్, షరీపొద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నర్సింహులు ఎన్నికయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899